క్లుప్తంగా

రాళ్ల వాగు వద్ద రాకపోకలకు ఇబ్బందులు



వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర పంచాయతీ రాళ్ల వాగు వద్ద బ్రిడ్జి కుంగిపోవటంతో రాకపోకలకు అంతరాయం కలుగకుండా తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశారు. కాగా బుధవారం ఉదయం కురిసిన వర్షానికి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు బురదమయంగా మారటంతో వెంకటాపురం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు రాళ్ల వాగుపై బ్రిడ్జికి మరమ్మత్తులు చేసి రాకపోకలకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాని స్థానికులు కోరుతున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఏటూరునాగారం: ఏజెన్సీలోని గిరిజన మండలాల్లో వైద్య, ఆరోగ్య జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా మాతశిశు ఆరోగ్య, ఎపీడమిక్ బృందాల(మొబైల్‌టీం) కన్నాయిగూడెం, వెంకటాపురం మండలాల్లో పనిచేసేందుకు ఇద్దరు వైద్యుల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఏటూరునాగారం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మల్టిజోన్-1 కాళేశ్వరం జోన్ పరిధిలో కలిగిన వ్యక్తులు అయి ఉండాలన్నారు. విద్యార్హతలు వైద్యాధికారి సీఏఎస్ పోస్టుకు ఎంబీబీఎస్ ఉత్తీర్ణత పొంది మెడికల్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకొని ఉండాలన్నారు. 2025 జూలై 1 నాటికి 46 వయస్సు లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ సర్టిఫికెట్స్ జిరాక్స్‌లను జతపర్చి ఈనెల 21 సాయంత్రం 5 గంటల వరకు ఐటీడీఏలోని హెల్త్ విభాగంలో అందించాలన్నారు.

దళిత ఎంపీని అవమానించడం సరికాదు



కాటారం: కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్వాగత తోరణాల్లో దళిత వర్గానికి చెందిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఫొటో పెట్టకుండా దేవాదాయశాఖ అధికారులు అవమానించడం సరికాదని మండల దళిత నాయకుడు జక్కు శ్రావణ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రావణ్ మాట్లాడుతూ.. ప్రజాధనంతో నిర్వహిస్తున్న పుష్కరాల స్వాగత కటౌట్‌లో ఎంపీ ఫొటో పెట్టకపోవడం దళిత జాతిని అవమానపర్చినట్లే అని ఆరోపించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చే మంత్రి శ్రీధర్‌బాబుకు ఇది కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

గ్రామకమిటీ ఎన్నిక

రేగొండ: మండలంలోని కొడవటంచలో నూతన కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ నాయకుడు పున్నం రవి తెలిపారు. అధ్యక్షుడిగా బొగిరి రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా మల్లెబోయిన తిరుపతి, ఉపాధ్యక్షులుగా మల్లెబోయిన భద్రయ్య, కోశాధికారిగా కోటేశ్వరరావును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడవటంచ ఆలయ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, మండల నాయకులు పట్టెం శంకర్, శ్రీధర్, పున్నం ప్రవీణ్, కొమ్మురాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల బీమా లేనట్టేనా?

- నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



వెంకటాపురం(కె): గతంలో పాడి పశువులు అనారోగ్యం బారిన పడి లేదా వేరే కారణాలతో మృతి చెందింతే బీమా సౌకర్యం ఉండేది. పశువులకు బీమా సౌకర్యం వల్ల కంపెనీల నుంచి నష్ట పరిహారం వచ్చేది. దీంతో పాడి రైతులు, రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేవారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం పశువులకు ఎలాంటి బీమా సౌకర్యం కల్పించకపోవటంతో పశువులు మృతి చెందితే ఆర్థికంగా నష్ట పోతున్నారు. మండలంలో దాదాపు 12 వేల పశువులు ఉన్నాయి. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గొర్రెల పంపిణీ పథకానికి ప్రభుత్వం మొదటి సారి బీమా సౌకర్యం కల్పించింది. కాగా యాదవులకు పంపిణీ చేసిన గొర్రెలకు బీమా గడువు ముగియడంతో బీమాను రెన్యూవల్ చేయక పోవడంతో గొర్రెలకు బీమా సౌకర్యం లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వం గతంలో మాదిరిగానే గొర్రెలకు, రైతుల వద్ద ఉన్న పశువులకు బీమా సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

బీమా సౌకర్యం కల్పించాలి



గేదెలతో పాటు ఎద్దులకు, గొర్రెలకు మేకలకు బీమా సౌకర్యాన్ని కల్పించాలి. గతంలో బీమా సౌకర్యం ఉండడంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుతం బీమా లేక పోవటంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వం స్పందించి బీమా సౌకర్యం కల్పించాలి.

– ఆదినారాయణ, రైతు, వెంకటాపురం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికుమార్



రికార్డులను పరిశీలిస్తున్న క్రాంతి కుమార్

వాజేడు: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏటూరునాగారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కోరం క్రాంతికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, హాజరు పట్టికను పరిశీలించి మాట్లాడారు. పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి వైద్యం అందించాలని సూచించారు. సీజనల్ సమయంలో వచ్చే వ్యాధులకు సకాలంలో వైద్యం అందేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధి బారిన పడి పెనుగోలు గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త ఉయిక సమ్మక్క ఇటీవల మృతి చెందిన విషయం విధితమే. కాగా ఆమె కుటుంబానికి జిల్లాలోని వైద్య సిబ్బంది రూ.35,400ఆర్థిక సాయాన్ని క్రాంతి కుమార్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మహేందర్, మధుకర్, వేణుగోపాల కృష్ణ, హెచ్‌ఎస్. కోటిరెడ్డి, హెచ్‌వీ వెంకటరమణ, వైద్య, ఆరోగ్య, సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మతల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలి

టేకుమట్ల: పోచమ్మతల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లిలో బుధవారం పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, మాజీ ఎంపీపీలు రెడ్డి మల్లారెడ్డి, బందల నరేష్, ఆది రఘు, వెంకటేశ్వర రెడ్డి, మహేష్‌యాదవ్, లింగారెడ్డి ఉన్నారు.

జీఓ 3ను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న పూనెం సాయి

వెంకటాపురం(కె): జీఓ 3ను పునరుద్ధరించాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం పూనెం ప్రతాప్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పూనెం సాయి మాట్లాడుతూ.. షెడ్యూల్ ఏరియాలో స్థానిక రిజర్వేషన్ జీఓ నం3 ద్వారానే ఆదివాసీ నిరుద్యోగులు ఉద్యోగాలు పొందారని అన్నారు. రాష్ట్రల పునర్ విభజనలో షెడ్యూల్ ఏరియాను చిన్నభిన్నం చేసి ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. ఇప్పటికైన సీఎం రేవంత్‌రెడ్డి జీఓ 3ను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 31న చేపట్టిన భద్రాచలం ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పర్శిక బాబురావు, పూనెం విజయ్, సభక రాజు, కృష్ణార్జునరావు, ఏడు కొండలు తదితరులు ఉన్నారు.

గ్రామసభను రాజుపేటలోనే నిర్వహించాలి



ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

మంగపేట: మండలంలోని గొల్లగూడెం ఇసుక ర్యాంపు కోసం నిర్వహించే పెసా గ్రామ సభను రాజుపేటలోనే నిర్వహించాలని గ్రామానికి చెందిన గిరిజన సొసైటీ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొల్లగూడెం గ్రామం పూర్వం నుంచి రాజుపేట గ్రామపంచాయతీలోనే కొనసాగిందని గతంలో గొల్లగూడెంలో నివసించే వారు ప్రస్తుతం రాజుపేటలో నివసిస్తున్నారని అన్నారు. అయితే గొల్లగూడెం ఇసుక రీచ్ మీద కన్నేసిన రమణక్కపేటకు చెందిన కొంతమంది కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు గొల్లగూడెం రెవెన్యూ గ్రామాన్ని రమణక్కపేట గ్రామపంచాయతీలో ఉన్నట్లు చూపించాలని స్థానిక అధికారుల మీద ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తుందని ఆరోపించారు. ఇసుక ర్యాంపు గుర్తించడం కోసం నిర్వహించే పెసా గ్రామసభను గ్రామ పంచాయతీ పరిధి కాకుండా పెసా గ్రామ పంచాయతీలు, వాటి ఆమ్లెట్ గ్రామాలను పరిశీలించి రాజుపేటలో నిర్వహించాలన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్సైలు

కాటారం: మండలంలో పలు చోట్ల పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ఎస్సై-2 శ్రీనివాస్, ప్రొబేషనరీ ఎస్సై గీతారాథోడ్ ఆధ్వర్యంలో పోలీసులు రికవరీ చేసి తిరిగి బాధితులకు బుధవారం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని దామెరకుంటకు చెందిన వెంకటేశ్వర్లు, బస్వాపూర్‌కు చెందిన కొమురయ్య, రేగులగూడెంకు చెందిన లక్ష్మికాంత్ ఇటీవల మండల పరిధిలో సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన పోలీసులు సెల్‌ఫోన్‌లను రికవరీ చేశారు. ఈ మేరకు బాధితులకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సైలు సెల్‌ఫోన్‌లను అప్పగించారు. మొబైల్ ఫోన్ పోతే ఆందోళన చెందొద్దని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ముందుండాలి

నర్సంపేట : రైతు సంక్షేమ సేవా సంఘం బాధ్యులు రైతులకు అండగా ఉంటూ రైతుల సమస్యలపై ముందుండాలని రైతు సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆబోతు రాజుయాదవ్ కోరారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్సంపేటకు చెందిన వరంగంటి కవితను రైతు సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, జిల్లా కార్యదర్శిగా బాల్నె సుభాష్, ప్రచార కార్యదర్శిగా మోటం కన్నీ, బూస రంజిత్‌లను నియమించినట్లు ప్రకటించారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌యాదవ్ నాయకత్వంలో రైతులకు ప్రభుత్వం ద్వారా నాణ్యమైన విత్తనాలు, మొక్కలను అందిస్తూ గోశాలలో ఉండే గోవులను రైతులకు అందించే దిశగా కృషి చేయాలన్నారు.

ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



ఏటూరునాగారం: రైతులతో మాట్లాడుతున్న బడే నాగజ్యోతి



గోవిందరావుపేటలో..

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

ఏటూరునాగారం: జిల్లాలో తడిసిన ప్రతీ ధాన్యం గింజను ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని గోగుపల్లి గ్రామంలో తడిసిన ధాన్యంను నాగజ్యోతి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యంకు సరైన రక్షణ లేకుండా పోయిందన్నారు. అకాల వర్షానికి ధాన్యం పంటను నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, తుమ్మ మల్లారెడ్డి, ఖాజాపాషా, కాళ్ల రామకృష్ణ, సంజీవరెడ్డి, నగేష్, రామయ్య, రఘు, రామ్మూర్తి, చంద్రబాబు, రాంబాబు, నర్సయ్య,, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతును ఆదుకోవాలి

మండలంలోని గోగుపల్లిలో అకాల వర్షం వల్ల నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. బుధవారం గోగుపల్లిలోని తడిసిన ధాన్యంను ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

గోగుపల్లిలో నష్టపోయి రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు పల్లా బుచ్చయ్య అన్నారు. బుధవారం గోగుపల్లిలో వరి ధాన్యంను ఆయన పరిశీలించారు. ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చక్రవర్తి, సత్యం, ఎల్లయ్య, ఎలేందర్, చంద్రారెడ్డి, రవి, దుర్గారావు, వెంకన్న పాల్గొన్నారు.

గోవిందరావుపేట: మండలంలో బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో రైతుల దాన్యం తడిసి ముద్దయిందని, తడసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు గుండు రామస్వామి అన్నారు. రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో గోవిందరావుపేట, చల్వాయి గ్రామాల్లో వర్షంతో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. రైతులు ఆరబోసుకోవడానికి సరైన మార్కెట్ స్థలం లేకపోవడం ద్వారా ఎక్కడపడితే అక్కడ ధాన్యాన్ని ఆరపోసుకున్నారని అన్నారు. దీంతో రైతుల ధాన్యం వర్షానికి పూర్తిగా తడిసి పోయిందని తెలిపారు. రైతు సంఘం నాయకులు సదానందం, కడారి నాగరాజు, గుండు లెనిన్, నిమ్మల భిక్షం, మోటం సాంబయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్జద్‌పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాయినిగూడెం రహదారిపై రాస్తారోకో చేశారు. అనంతరం మండలంలోని అంకన్నగూడెం, సర్వాపూర్, గ్రామాలలో ఏర్పాటు చేసిన ఐకేపి కొనుగోలు కేంద్రాలలో తడిన ధాన్యాన్ని పరిశీలించారు. నారాయణ, కృష్ణయ్య, సాంబయ్య, తిరుపతి, పాతయ్య, సాంబయ్య, రామారావు, లక్ష్మీ, సమ్మక్క, సమ్మయ్య, సంపత్, రవి పాల్గొన్నారు.



ములుగు రూరల్: ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు



ఏటూరునాగారం: తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నిలిచిన విద్యుత్ సరఫరా



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వాజేడు: గాలివానతో మండలంలో బుధవారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వెంకటాపురం(కె) నుంచి వచ్చే 33 కేవి విద్యుత్ లైన్‌లో పలు చోట్ల ఇన్సులేటర్లు పగిలిపోయాయి. ఉదయం నాలుగు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సిబ్బంది సమస్య ఏర్పడిన చోటకు వెళ్లి కొత్తగా ఇన్సులేటర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పోలీసుల అదుపులో ఐదుగురు మావోలు?

ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండలం మలకపల్లికి చెందిన ఓ వ్యక్తి ఇంటిలో తలదాచుకున్న మావోయిస్టులను పోలీసులు మంగళవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ముకునూరు నీలపల్లి సరిహద్దు, చిట్యాల భూపతిపూర్ అటవీప్రాంతంలో పవన్ అనే వ్యక్తి ఇంటిలో తలదాచుకున్నట్లు మావోయిస్టులను పట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే వారు సానుభూతి పరులా, మావోయిస్టు దళ సభ్యులా అనే అంశం పోలీసులు ఇంకా నిర్ధారించలేదు. సోమవారం రాత్రి ఇద్దరు మహిళలు, ముగ్గురు వ్యక్తులు కన్నాయిగూడెం మండల కేంద్రంలో పాదరక్షలు కొనుగోలు చేయగా వారి ఆచూకీ తెలుసుకుని అర్ధరాత్రి తర్వాత వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మంగళవారం అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని జిల్లా కేంద్రానికి తరలించారు.

వివరాలు గోప్యం..

కర్రెగుట్టలో మావోయిస్టులు, పోలీసులు మధ్య జరుగుతున్న ఎదురుకాల్పుల సమయంలోనే మావోయిస్టు పార్టీకి చెందిన వ్యక్తులు పోలీసులు చిక్కినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో ఇన్‌ఫార్మర్ నెపంతో ముగ్గురిని మావోయిస్టులు రెండు రోజుల క్రితం హతమార్చారు. తమ అదుపులో ఉన్న వ్యక్తుల వివరాలు పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

టేకుమట్ల: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం రామకిష్టాపూర్(టీ) నుంచి మండల కేంద్రానికి జై బీం, జై బాపు, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగంపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగించేందుకు పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, ఎన్నికల జిల్లా పరిశీలకులు ఇనగాల వెంకట్రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కటంగూర్ రాంనర్సింహరెడ్డి, గాదర్ల ఐతు, శ్యాస్త్రాల కిరణ్, నాంపెల్లి వీరేశం, వైనాల రవిందర్, అడగాని రామారావు, కొయ్యల చిరంజీవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ బుధవారం రామప్ప ఆలయ సందర్శన నేపథ్యంలో రామప్ప గార్డెన్‌లో భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకతీయుల రాజుల పరిపాలన, రాణిరుద్రమదేవి వీరత్వాన్ని చాటుతూ కళాకారులు నృత్యరూపంలో ప్రదర్శనిచ్చారు. ప్రముఖ పేరిణి నాట్య కళాకారుడు రంజిత్ బృందంలోని 65 మంది కళాకారులు పేరిణి శివతాండవం నృత్యం పలువురిని ఆకట్టుకుంది. అనంతరం రామప్ప ఆలయ చరిత్రను తెలియజేస్తూ 15 నిమిషాలు లేజర్ షో నిర్వహించారు.

- వెంకటాపురం(ఎం)



పేరిణి శివతాండవ నృత్యం చేస్తున్న కళాకారులు



మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్‌కు జ్ఞాపికలు అందజేస్తున్న మంత్రి సీతక్క



నృత్యాలు చేస్తున్న కళాకారులు

కంకల వాగులో పడి మహిళ మృతి



పద్మావతి (ఫైల్)

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాలయం వీధికి చెందిన వివాహిత ప్రమాదవశాత్తు కంకలవాగులో పడి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శివాలయం వీధికి చెందిన పానెం పద్మావతి(42) ఈ నెల 13న తెల్లవారు జామున నిద్రలేచి బహిర్భూమికి ఇంటి వెనుక ఉన్న కంకల వాగు ఒడ్డుకు వెళ్లిందని తెలిపారు. ప్రమాదవశాత్తు కాలుజారి కంకల వాగులో పడి మృతి చెందిందని తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొప్పు తిరుపతి రావు తెలిపారు.